సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

9705347494

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

వైద్య శిబిరానికి విశేష స్పందన



రోగికి కంటి పరీక్ష చేస్తున్న వైద్యురాలు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ఎస్సీ కాలనీలోని అంబేద్కర్ కమ్యూనిటీ హాల్‌లో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. నియో విజన్ స్పెషాలిటీ ఐ ఆస్పత్రి ఆధ్వర్యంలో 250 మందికి ఉచితంగా కంటి పరీక్షలు చేశారు. కార్యక్రమంలో డా. బాలకృష్ణ స్థానిక నాయకులు చెట్టుపల్లి గోపీ, ఒమ్మి బాబూరావు, ఉప్పులూరి గోపి, బెల్లాన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నిషేధిత ప్లాస్టిక్ సంచులు స్వాధీనం



బీచ్‌రోడ్డు ప్రాంతంలో తనిఖీలు నిర్వహిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

కొమ్మాది: సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై అధికారులు దృష్టి సారించారు. జోనల్ కమిషనర్ అయ్యప్పనాయుడు ఆదేశాల మేరకు జీవీఎంసీ 4వ వార్డు భీమిలి బీచ్ రోడ్డు ప్రాంతాల్లో శనివారం శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహాలక్ష్మీనాయుడు ఆధ్వర్యంలో పలు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఉప్పాడ, కె.నగరపాలెం, నిడిగట్టు, కాపులుప్పాడ ప్రాంతాల్లో గల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి, నిషేధిత ప్లాస్టిక్ సంచులను స్వాధీనం చేసుకున్నారు.

ఆహ్లాదం ఆరోగ్యం

● కళకళలాడుతున్న స్పోర్ట్స్ థీమ్ పార్క్

సాయంత్రమైతే చాలు బక్కన్నపాలెంలోని స్పోర్ట్స్ థీమ్ పార్క్ క్రీడాకారులు, సందర్శకులతో కళకళలాడుతోంది. చిన్నారులకు చక్కని ఆహ్లాదాన్ని.. పెద్దలకు తేలికపాటి వ్యాయామాన్ని.. యువత క్రీడల్లో రాణించే విధంగా రూపొందించిన క్రీడాప్రాంగణాలను రూపొందించడంతో నిత్యం సందడిగా ఉంటోంది. పార్కుల పరిరక్షణకు, అభివృద్ధికి ఎంతో ప్రాధాన్యం ఇచ్చిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సుమారు ఎకరం విస్తీర్ణంలో రూ.1.95 కోట్లతో ఈ పార్కును సర్వాంగసుందరంగా తీర్చిదిద్దింది. అనేక వసతులతో పాటు క్రీడాకారులకు అనువుగా ప్రాంగణాలను అభివృద్ధి చేసింది. క్రీడా ప్రాంగణాలకు ఈపీడీఎం, టెన్నిస్ కోర్టు సింథటిక్ ఫ్లోరింగ్ వేశారు. వాలీబాల్, టెన్నిస్, షటిల్ బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, క్రికెట్ ప్రాక్టీస్ నెట్‌ల వద్ద క్రీడాకారులు రోజూ పోటాపోటీగా ప్రాక్టీస్ చేసుకుంటున్నారు. ఇక ఊయలలు, జారుడు బల్లల వద్ద చిన్నారులు కేరింతలు కొడుతూ ఆడుకుంటున్నారు. ఇక పెద్దలకు వాకింగ్ ట్రాక్, సేద తీరేందుకు బల్లలు, గ్రాస్ ల్యాన్ ఉండటంతో చిన్న పెద్ద ఉత్సాహంగా సమయం గడుపుతున్నారు. ఆహ్లాదం, ఆనందాన్ని నింపేవిధంగా పార్కును అభివృద్ధి చేసిన గత ప్రభుత్వానికి సందర్శకులు, కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. - మధురవాడ



పార్కులో సందడి



ఆటలాడుతూ ఉల్లాసంగా గడుపుతున్న చిన్నారులు



బక్కన్నపాలెంలోని స్పోర్ట్స్ థీమ్ పార్కు



షటిల్ బ్యాడ్మింటన్ ఆడుతున్న క్రీడాకారులు



క్రికెట్ ప్రాక్టీస్ చేస్తున్న యువకులు



బాస్కెట్‌బాల్ ఆటల్లో నిమగ్నం

అలరించిన శాస్త్రీయ నృత్యపోటీలు

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరం ఐఐఎంవీ రోడ్డులోని హరేకృష్ణ వైకుంఠంలో హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో ఈ నెల 2 నుంచి 11 వరకు జరుగుతున్న హెరిటేజ్ ఫెస్ట్ -2025లో భాగంగా శనివారం బాలబాలికలకు వ్యక్తిగత, బృంద శాస్త్రీయ నృత్యపోటీలు నిర్వహించారు. శ్రీరాధా మదన మోహన మందిరంలో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 వరకు నిర్వహించిన ఈ పోటీల్లో జిల్లాకు చెందిన 22 పాఠశాలల నుంచి సుమారు 275 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ నెల 11న జరగనున్న కుండపై పెయింటింగ్, పేపర్ క్రాఫ్ట్ వర్క్ పోటీలతో హెరిటేజ్ ఫెస్ట్ ముగియనుంది. ఆసక్తి గల బాలబాలికలు 99853 64430, 87901 60232 నంబర్లలో సంప్రదించాలని హరేకృష్ణ మూవ్‌మెంట్ ప్రతినిధి అంబరీష దాస కోరారు.



నృత్య పోటీల్లో పాల్గొన్న బాల బాలికలు

ముగిసిన ఝులన్ యాత్ర

వైభవంగా బలరామ పూర్ణిమ

తగరపువలస: గంభీరం ఐఐఎంవీ రోడ్డులోని హరేకృష్ణ వైకుంఠంలో ఈ నెల 5న ప్రారంభమైన ఝులన్ యాత్ర శనివారంతో ముగిసింది. అలాగే బలరామ జయంతిని హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో వైభవంగానిర్వహించారు. భక్తులు హరేకృష్ణ మహామంత్ర సంకీర్తన నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలు చేసి శ్రీరాధా మదన్ మోహనులకు, బలరామునికి ప్రత్యేక హారతులు ఇచ్చారు. హరేకృష్ణ మూవ్‌మెంట్ అధ్యక్షుడు నిష్కించన భక్తదాస బలరామ జయంతి ప్రాముఖ్యత గురించి వివరించారు. చివరగా శ్రీరాధాకృష్ణులకు ఊయలసేవ నిర్వహించి సేవలు ముగిసినట్టు ప్రకటించారు. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. హరేకృష్ణ వైకుంఠం ప్రతినిధి అంబరీష దాస తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో శ్రీరాధా మదన మోహనులు

50 మందికి కంటి వైద్య పరీక్షలు



కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

తగరపువలస: భగవాన్ సత్యసాయిబాబా శత జయంత్యుత్సవాల సందర్భంగా భీమిలి మండలం తాళ్లవలస పంచాయతీ యాతపేటలో శనివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 50 మందికి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 15 మందికి శస్త్రచికిత్సలు అవసరం కాగా, శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రికి తరలించారు. కార్యక్రమంలో చిట్టివలస సత్యసాయి సేవాసమితి కన్వీనర్ గొట్టుపల్లి సత్యనారాయణ, కంటి వైద్య నిపుణురాలు ఎస్.భారతి, జోనల్ కో-ఆర్డినేటర్ ఎంవీ సత్యసాయికుమార్, జిల్లా జాయింట్ యూత్ కో ఆర్డినేటర్ డి.శరత్‌కుమార్, క్యాంప్ కో ఆర్డినేటర్ వై.పైడిరాజు, సీనియర్ సేవాదళ్ తోలేటి శర్మ తదితరులు పాల్గొన్నారు.

రెండో తరగతి విద్యార్థి జీవితంతో విద్యాశాఖ చెలగాటం

తగరపువలస: పద్మనాభం మండలం రౌతులపాలెం ప్రాథమిక పాఠశాలలో రెండో తరగతి చదువుతున్న ఆరున్నరేళ్ల విద్యార్థి మోపాడ ఉత్తేజ్ భవిష్యత్తుతో ఆనందపురం మండలం వెల్లంకి పంచాయతీలో ఉన్న రవీంద్రభారతి స్కూల్ యాజమాన్యం ఆటలాడుతోంది. గత విద్యాసంవత్సరంలో రవీంద్రభారతి పాఠశాలలో ఒకటో తరగతి చదివిన ఉత్తేజ్‌ను, ఈ ఏడాది రౌతులపాలెం పాఠశాలలో చేర్పించారు. రవీంద్రభారతి యాజమాన్యం రికార్డుషీట్ ఇచ్చినా డ్రాప్ బాక్స్‌లో విద్యార్థి పేరు చేర్చనందున రౌతులపాలెం పాఠశాలలో కొనసాగలేకపోతున్నాడు. దీంతో సోమవారం నుంచి జరగనున్న ఎఫ్‌ఏ-1 పరీక్షలకు హాజరు కాలేని పరిస్థితి నెలకొంది. ఎంఈవోలు కూడా స్పందించలేదు. విద్యాశాఖ నిర్లక్ష్యంపై తల్లిదండ్రులు సోమవారం కలెక్టరేట్‌లో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆనందపురం, పద్మనాభం ఎంఈవోలపై ఫిర్యాదు చేయనున్నారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

తగరపువలస: 33/11 కేవీ ఆనందపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ పెద్దిపాలెం ఫీడర్‌పై త్రీఫేజ్ లైన్ వేస్తున్న కారణంగా సోమవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.సింహాచలం నాయుడు తెలిపారు. ఈ కారణంగా పెద్దిపాలెం, పల్లిపేట, మచ్చవానిపాలెం, పడాల వారి కళ్లాలు, బీపీ కళ్లాలు, పాడుగుపాలెం, చందక, గొట్టిపల్లి, జగన్నాథపురం, వెంకటాపురం, కుసులవాడ, చీమ మెట్టమీద పాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

అనంతునికి అద్దాల మండపం బహూకరణ



అద్దాల మండపం బహూకరించిన దాతలు

పద్మనాభం: పద్మనాభంలో గిరిపై ఉన్న అనంత పద్మనాభ స్వామికి పద్మనాభం పంచాయతీ అర్చకునిపాలెం గ్రామానికి చెందిన తాలాడ రామకృష్ణ, యశోద దంపతులు శనివారం అద్దాల మండపాన్ని కానుకగా బహూకరించారు. ఎంపీపీ కంటుబోతు రాంబాబు, రామకృష్ణ, యశోద దంపతులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నేడు శిల్పారామంలో నృత్య ప్రదర్శనలు

పీఎం పాలెం: శిల్పారామం (జాతర)లో ఆదివారం సాయంత్రం 6 గంటలకు కూచిపూడి, జానపద నృత్యాల ప్రదర్శన ఉంటుందని స్థానిక పరిపాలన అధికారి రమేష్ రెడ్డి తెలిపారు. నగరానికి చెందిన శివ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ ప్రదర్శన ఉంటుందన్నారు.

ఉత్సాహంగా నాటిక పోటీలు ప్రారంభం



నాటికలను ప్రదర్శిస్తున్న బాలికలు

భీమునిపట్నం: భీమిలిలోని కళాసాహితి సంస్థ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న నాటిక పోటీలు శనివారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సన్ స్కూల్ డైరెక్టర్ కైతపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇటువంటి పోటీల్లో పాల్గొనడం వల్ల విద్యార్థుల్లో ప్రతిభ బయటపడుతుందన్నారు. కళలపై ఆసక్తిని పెంపొందిస్తూ కళాసాహితి సంస్థ వీటిని ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. ఎంఈవో ఎం.శివరాణి, డొకర శ్రీనివాసరావు మాట్లాడుతూ గెలుపు ఓటములను పట్టించుకోకుండా విద్యార్థులు పోటీల్లో పాల్గొనడం ప్రధానమని పేర్కొన్నారు. కళాసాహితి అధ్యక్షుడు పి.రాజేంద్రప్రసాద్ వర్మ మాట్లాడుతూ పోటీల్లో 11 పాఠశాలల నుంచి 250 మంది విద్యార్థులు పాల్గొంటున్నారని తెలిపారు. పోటీల్లో భాగంగా మొదటి రోజు 'తాగొద్దు.. భవిష్యత్తు ముద్దు', చదువుకోని పెళ్లి కొడుకు, మేము కూడా జీవులమే, సామాజిక మాధ్యమాలు, మాదక ద్రవ్యాల వల్ల నష్టాలు మొదలైన నాటికలు ప్రదర్శించారు. కార్యక్రమంలో కళాసాహితి సభ్యులు, పిల్లల తల్లితండ్రులు పాల్గొన్నారు.

శ్రీవారికి వైభవంగా స్నపన తిరుమంజనం

కొమ్మాది: రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రవణా నక్షత్రం సందర్భంగా స్నపన తిరుమంజన సేవను వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీవారి ఉత్సవమూర్తులను మంగళవాయిద్యాల నడుమ ఆలయ ప్రాంగణంలో ప్రతిష్ఠించారు. అనంతరం టీటీడీ అర్చకుల ఆధ్వర్యంలో ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో టీటీడీ అర్చకులు, వేద పండితులు, అధికారులు, ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.



ఉత్సవ మూర్తులకు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

డీఎంహెచ్‌వో ఆకస్మిక తనిఖీ

- పీహెచ్‌సీలో స్టాఫ్‌నర్సులు, సిబ్బందిపై ఆగ్రహం

తగరపువలస: వైద్య ఆరోగ్య సిబ్బంది తమకు నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జగదీశ్వరరావు సూచించారు. శనివారం ఆయన ఆనందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రొటీన్ ఇమ్యూనైజేషన్‌పై మాట్లాడారు. 375 మంది డ్రాపౌట్లను గుర్తించి స్టాఫ్ నర్సులు, సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం నాటికి డ్రాపౌట్లు అన్నీ క్లియర్ చేయాలని ఆదేశించారు. ఈహెచ్‌ఆర్ సంతృప్తికరంగా లేదన్నారు. ఆరోగ్యకేంద్రం ఆవరణలో ఉన్న బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ నూతన భవనాన్ని పరిశీలించి, పెండింగ్ పనులు వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. సిబ్బంది హాజరుపట్టిక, ఆన్‌లైన్ నివేదికలు, మందుల గది, లేబర్ రూమ్, ప్రయోగశాల, వార్డులను పరిశీలించారు. మందులు అందుబాటులో ఉన్నాయా లేదా అడిగి తెలుసుకున్నారు. ప్రసవ గది, శస్త్రచికిత్సలకు అవసరమైన పరికరాలు సమాకూరుస్తామని తెలిపారు. ఆరోగ్య సిబ్బందితో సమీక్షించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి షబీనాభాను, జిల్లా వైద్య ఆరోగ్య విస్తరణ అధికారి నాగభూషణం పాల్గొన్నారు.



పీహెచ్‌సీ సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

కేజీబీవీని సందర్శించిన డీఈవో

భీమునిపట్నం: భీమిలిలోని కస్తూర్బాగాంధీ విద్యాలయాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి ప్రేమ్‌కుమార్ శనివారం సందర్శించారు. విద్యాలయం నిర్వహణను పరిశీలించారు. పాఠ్యాంశాల బోధన, సదుపాయాలపై ఆరా తీశారు. విద్యార్థుల అసైన్‌మెంట్ పుస్తకాలను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గంగాకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.



అసైన్‌మెంట్ పుస్తకాలను పరిశీలిస్తున్న డీఈవో ప్రేమ్‌కుమార్

ఘనంగా ఆదివాసీ దినోత్సవం

ఆకట్టుకున్న విద్యార్థుల వేషధారణలు

మధురవాడ: గిరిజన దినోత్సవాన్ని తిమ్మాపురం రోడ్డులోని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించే విధంగా వేసుకున్న వేషధారణలు అలరించాయి. అల్లూరి, కొమురం భీం, బిర్సాముండా వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వీరు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ ఎల్. శివప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా గిరిజన సంక్షేమ అధికారి బి. సురేష్‌కుమార్ హాజరయ్యారు. శంభువానిపాలేనికి చెందిన గిరిజన నాయకుడు వి.దేవుడును వారు సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న జిల్లా సంక్షేమ అధికారి తదితరులు

ఎంపీపీ రాంబాబుకు రక్షాబంధన్

పద్మనాభం ఎంపీపీ కంటుబోతు రాంబాబుకు బ్రహ్మకుమారీలు శనివారం రాఖీ కట్టారు. మద్దిలో ఉన్న ఎంపీపీ ఇంటికి వెళ్లి, రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. - పద్మనాభం

